
# సీజేఐగా నేడు జస్టిస్ బీఆర్ గవాయ్ బాధ్యతలు

- పదవి చేపట్టనున్న రెండో దళిత న్యాయమూర్తి
- పదవీ విరమణ చేసిన జస్టిస్ సంజీవ్ ఖన్నా


న్యూఢిల్లీ: 52వ భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)గా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా మంగళవారం పదవీ విరమణ చేశారు. 2019 మే 24న సుప్రీంకోర్టుకు పదోన్నతిపై వచ్చిన జస్టిస్ గవాయ్ సీజేఐగా ఆరు నెలలకుపైగా కొనసాగుతారు. 2025 నవంబర్ 23న సీజేఐగా ఆయన పదవీ విరమణ చేస్తారు. జస్టిస్ కేజీ బాలకృష్ణన్ తర్వాత సీజేఐగా బాధ్యతలు చేపట్టనున్న రెండో దళిత న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ కావడం విశేషం. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల పదవీ విరమణ వయసు 65 సంవత్సరాలు.

### పలు కీలక తీర్పులు..

1960 నవంబర్ 24న మహారాష్ట్రలోని అమ్రావతిలో జన్మించిన జస్టిస్ గవాయ్ 2003 నవంబర్ 14న బాంబే హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2005 నవంబర్ 12న అదే హైకోర్టులో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అనేక చరిత్రాత్మక తీర్పులను వెలువరించిన సుప్రీంకోర్టుకు చెందిన పలు రాజ్యాంగ ధర్మాసనాలలో జస్టిస్ గవాయ్ కూడా ఉన్నారు. పూర్వ జమ్మూ కశ్మీరు రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే రాజ్యాంగంలోని 370 అధికరణను రద్దు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని ఏకగ్రీవంగా సమర్థించిన ఐదుగురు న్యాయ



మూర్తుల రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ గవాయ్ కూడా ఉన్నారు. రాజకీయ పార్టీలకు నిధులను సమకూర్చే ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేసిన మరో ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనంలో కూడా జస్టిస్ గవాయ్ సభ్యుడిగా ఉన్నారు. రూ. 1000, రూ. 500 నోట్లను రద్దు చేస్తూ కేంద్రం 2016లో తీసుకున్న నిర్ణయాన్ని 4:1 మెజారిటీతో ఆమోదించిన మరో ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనంలో కూడా జస్టిస్ గవాయ్ పాత్ర ఉంది. ఎస్సీల వర్గీకరణ చేపట్టేందుకు రాష్ట్రాలకు అధికారాలను అందచేస్తూ 6:1 మెజారిటీతో తీర్పును వెలువరించిన ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనంలో కూడా జస్టిస్ గవాయ్ ఉన్నారు. జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఓ ముఖ్యమైన తీర్పును వెలువరిస్తూ 15 రోజుల ముందస్తు నోటీసు ఇవ్వకుండా ఏ ఆస్తిని కూల్చరాదని ఆదేశిస్తూ దేశవ్యాప్తంగా మార్గదర్శకాలు జారీచేసింది. అడవులు, వన్యప్రాణులు, చెట్ల పరిరక్షణకు సంబంధించిన అంశాలను విచారించే ధర్మాసనాలకు ఆయన సారథ్యం వహిస్తున్నారు.



సీజేఐ ఖన్నాకు జ్ఞాపిక అందిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు


## రిటైర్మెంట్ తర్వాత ఏ పదవీ చేపట్టను: జస్టిస్ ఖన్నా

సీజేఐగా పదవీ విరమణ చేసిన తరువాత అధికారిక లేదా అనధికారిక బాధ్యతలేవీ చేపట్టబోనని సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా స్పష్టం చేశారు. కోర్టు ఆవరణలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రిటైర్మెంట్ తరువాత ఎటువంటి పదవినీ స్వీకరించబోనని, అయితే చట్టానికి సంబంధించి ఏదో ఒకటి చేస్తానని స్పష్టం చేశారు. 'నాకు మూడో ఇన్నింగ్స్ ఉంటుంది, అప్పుడు చట్టానికి సంబంధించి ఏదైనా చేస్తాను' అన్నారు. సీజేఐగా ఆయన మంగళవారం పదవీ విరమణ చేశారు. సుప్రీంకోర్టు ఆవరణలో బార్ కౌన్సిల్ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జస్టిస్ సంజీవ్ ఖన్నా మాట్లాడుతూ.. తన తదుపరి వారసుడు జస్టిస్ గవాయ్ సుప్రీంకోర్టు విలువలను, ప్రాథమిక హక్కులను, రాజ్యాంగం మౌలిక సూత్రాలను కాపాడతారని ఆశాభావం వ్యక్తంచేశారు.

# ట్రంప్ జోక్యం.. భారత్ ఇరకాటం

## అమెరికా అధ్యక్షుడి వ్యాఖ్యలతో చిక్కుల్లో మోదీ సర్కారు

### భారత విదేశాంగ విధానంపై నీలినీడలు • కశ్మీర్‌పై ఇక ద్వైపాక్షిక విధానానికి స్వస్తి?



"పాక్‌ను సంతోష పెట్టిన ట్రంప్ ప్రకటన"

న్యూఢిల్లీ, మే 13: భారత్, పాకిస్థాన్ కాల్పుల విరమణకు అంగీకరించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మే 10వ తేదీ రాత్రి చేసిన ప్రకటన నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని ఇరకాటంలోకి నెట్టింది. అంతేగాక తన మధ్యవర్తిత్వంలోనే కాల్పుల విరమణపై రెండు దేశాలు అవగాహన వచ్చాయని ట్రంప్ చేసిన వ్యాఖ్యలతో భారత విదేశాంగ విధానమే ప్రశ్నార్థకంగా మారింది. 'వెయ్యేళ్ల' తర్వాత కశ్మీరు సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు భారత్, పాకిస్థాన్‌తో కలసి తాను కూడా చర్చల్లో పాల్గొంటానని ట్రంప్ చేసిన వ్యాఖ్యలు భారత్, పాకిస్థాన్ మధ్య 1972లో జరిగిన సిమ్లా ఒప్పందం స్ఫూర్తినే దెబ్బతీస్తున్నాయి. అయితే కశ్మీరు వివాదాన్ని ఏదో రకంగా అంతర్జాతీయ వేదికపైకి తీసుకురావాలని ఎప్పటినుంచో కోరుకుంటున్న పాకిస్థాన్‌కు ట్రంప్ ప్రకటన సంతోషాన్ని కలిగించింది. వెంటనే పాక్ పాలకులు ట్రంప్ ప్రకటనను స్వాగతించారు. జమ్ము కశ్మీర్ వివాదానికి పరిష్కారం కనుగొనడంలో తన వంతు మద్దతు ఉంటుందన్న ట్రంప్ ప్రకటనను స్వాగతిస్తున్నట్లు పాకిస్థాన్ పాలకులు ప్రకటించారు. ట్రంప్ నిర్మాణాత్మక పాత్ర పోషించనున్నారంటూ వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 22న జమ్ము కశ్మీరులోని పహల్గాంలో ఉగ్రవాదులు 26 మంది పర్యాటకులను పొట్టనపెట్టుకున్న తర్వాత ఈ ఉగ్రదాడికి పూర్తి బాధ్యత పాకిస్థాన్ ప్రభుత్వానిదేనని ప్రకటించిన భారత ప్రభుత్వం దాయాది దేశంపై అనేక దౌత్యపరమైన ఆంక్షలను విధించడంతోపాటు సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. అనంతరం ఆపరేషన్ సింధూర్ పేరిట పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీరు(పీఓకే)లోని ఉగ్ర స్థావరాలనే లక్ష్యంగా చేసుకుని సైనిక దాడులు జరిపింది. ఇరు దేశాల మధ్య సైనిక ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హఠాత్తుగా ఇరు దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించినట్టు ప్రకటించారు.

### సిమ్లా ఒప్పందానికి తూట్లు

సిమ్లా ఒప్పందం ప్రకారం భారత్, పాకిస్థాన్ తమ మధ్య ఉన్న అన్ని వివాదాలను ద్వైపాక్షికంగా మాత్రమే పరిష్కరించుకోవాలి. ఇందులో మూడో పక్షం జోక్యానికి ఏమాత్రం తావులేదు. 2019లో జమ్ము కశ్మీరులో ఆర్టికల్ 370ని రద్దు చేయడం ద్వారా రాజ్యాంగ సవరణలు చేపట్టిన తర్వాత కశ్మీరు వివాదాన్ని ఐక్య రాజ్యసమితి భద్రతా మండలిలో లేవనెత్తేందుకు చైనా, పాకిస్థాన్ ప్రయత్నించినప్పటికీ కశ్మీరు భారత్‌లో అంతర్భాగమని స్పష్టం చేసిన భారత్.. సిమ్లా ఒప్పందంలోని ద్వైపాక్షిక నిబంధనను పునరుద్ఘాటించింది. సింధూ జలాల ఒప్పందాన్ని నిలుపుదల చేయాలని భారత్ తీసుకున్న నిర్ణయానికి ప్రతీకారంగా తాము సిమ్లా ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్లు పాకిస్థాన్ ఏకపక్షంగా ప్రకటించింది. అయితే భారత్ మాత్రం సిమ్లా ఒప్పందానికి కట్టుబడే ఉంది. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం రాత్రి(మే 12) జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో ట్రంప్ మధ్యవర్తిత్వ ప్రకటనను ప్రస్తావించకపోవడాన్ని ప్రతిపక్షాలతోపాటు పలువురు మేధావులు ప్రశ్నిస్తున్నారు.

### ట్రంప్ వ్యాఖ్యలు అసంబద్ధం

అయితే కశ్మీర్ వివాదంపై ట్రంప్ ప్రకటనను రిటైర్డ్ భారతీయ సైనికాధికారి మేజర్ జనరల్ రామేశ్వర్ రాయ్ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. ట్రంప్ వ్యాఖ్యలను అసంబద్ధంగా, చౌరబాటుగా ఆయన అభివర్ణించారు. 'ఈ విషయంలో భారత్ వైఖరికి సంబంధించినంత వరకు భారత్, పాక్ మధ్య కశ్మీర్ ద్వైపాక్షిక అంశం మాత్రమే. దీంతో ప్రపంచానికి సంబంధం లేదు' అని 'ది ఇండిపెండెంట్' పత్రికతో మాట్లాడుతూ ఆయన స్పష్టం చేశారు. 'ట్రంప్‌నకు కూడా దీంతో సంబంధం లేదు. ఆయన జోక్యాన్ని ఏ సమయంలోనూ కోరుకోము. జమ్ము కశ్మీరులో మూడోపక్షం జోక్యాన్ని మనం ఎన్నడూ కోరలేదు.. కోరబోము' అని రాయ్ తెలిపారు. భారతీయ అధికారులు కూడా విదేశీ వ్యాఖ్యలకు లేదా విదేశీ జోక్యానికి కశ్మీర్ అతీతమని పునరుద్ఘాటిస్తున్నారు. 'భారత్ ఎవరి మధ్యవర్తిత్వాన్ని కోరుకోవడం లేదు. ఏ మధ్యవర్తి అవసరం మాకు లేదు' అని భారతీయ అధికారి ఒకరు ఇండియాటుడేకు తెలిపారు. అయితే ట్రంప్ ప్రకటనతో భారత్‌లో కొంత ఇబ్బందికర పరిస్థితి ఏర్పడిందని లండన్‌లోని కింగ్స్ కాలేజ్ విజిటింగ్ ప్రొఫెసర్ హర్షణ పంత్ అభిప్రాయం వ్యక్తం చేశారు. మూడో పక్షానికి దీంతో సంబంధం లేదన్నది భారతదేశ విధానమని ది 'ఇండిపెండెంట్' పత్రికకు ఆయన తెలిపారు. కశ్మీర్ వ్యవహారంలో తలదూర్చడానికి ఏ దేశమైనా ప్రయత్నిస్తే భారత్ వ్యతిరేకించక తప్పదని ఆయన చెప్పారు.

### వ్యూహాత్మక తప్పిదమా?

గత కొన్ని రోజులుగా జరుగుతున్న పరిణామాలను పరిశీలిస్తే పాకిస్థాన్‌తో పోలిస్తే భారత్ వ్యూహాత్మకంగా కొంత వెనుకబడినట్లు కనిపిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ వేదికపై భారత్‌కు మద్దతు ఇచ్చిన దేశాల సంఖ్య పాక్‌తో పోలిస్తే స్వల్పంగా ఉందని, అంతర్జాతీయ మీడియా కవరేజీలో కూడా భారత్ వెనుకబడి ఉందని వారు తెలిపారు. పాకిస్థాన్ పక్షాన చైనా బలంగా నిలువగా తుర్కియే, అజర్‌బైజాన్ బహిరంగ మద్దతు ప్రకటించాయి. తుర్కియే డ్రోన్లతో భారత్‌పై పాక్ విస్తృతంగా దాడులు జరిపింది. ఫ్రాన్స్ తటస్థంగా ఉండిపోయింది. అక్కడి నుంచి కొనుగోలు చేసిన రాఫెల్ విమానాల ప్రభావం రష్యాకు చెందిన ఎస్-400 పనిచేసినంతగా పనిచేయలేదు. భారత్‌కు రష్యా మద్దతు ప్రకటించినప్పటికీ సంయమనం పాటించాలని రెండు దేశాలను కోరింది. పాకిస్థాన్ జిహాదీ ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్నదన్న వాస్తవం ప్రపంచ దేశాలకు తెలిసినప్పటికీ భారత్‌కు మాత్రం ఆశించినంత మద్దతు లభించలేదని విశ్లేషకులు తెలిపారు.



**ట్రంప్ వ్యాఖ్యలు నాలుగు విధాలా భారత్‌కు నిరాశ: శశి థరూర్**

**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాల్పుల విరమణ ప్రకటన భారత్‌ను నాలుగు విధాలుగా తీవ్ర నిరాశకు గురిచేస్తున్నదని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ తెలిపారు.**

1. బాధితుడిని, నేరస్థుడిని సమాన దృష్టితో చూసేలా ఇది ఉంది. పాకిస్థాన్ గత చరిత్ర క్షుణ్ణంగా తెలిసిన అమెరికా గతంలో పాక్ పట్ల తీసుకున్న వైఖరికి ఇది పూర్తి భిన్నం.
2. పాకిస్థాన్‌కు చర్చలో పాల్గొనే అవకాశాన్ని ట్రంప్ కల్పించడం. పాకిస్థాన్‌కు ఇప్పటికీ ఆ అర్హత రాలేదు. తన తలపైన తుపాకీ పెట్టిన ఉగ్రవాదితో భారత్ ఎన్నటికీ చర్చలు జరపదు.
3. ఉగ్రవాదుల ప్రధాన లక్ష్యమైన కశ్మీర్ వివాదాన్ని అంతర్జాతీయం చేయడానికి ట్రంప్ ప్రకటన దోహదం చేస్తున్నది. దీన్ని వివాదంగా చూసేందుకు భారత్ ఇష్టపడడం లేదు. ఇది భారతదేశ అంతర్గత వ్యవహారంగానే భారత్ చూస్తున్నది.
4. ప్రపంచం దృష్టిలో భారత్, పాకిస్థాన్‌ను సమానంగా చూపే ప్రయత్నం చేయడాన్ని భారత్ ఎన్నటికీ అంగీకరించదు. అనేక దశాబ్దాలుగా ప్రపంచ నాయకులు ఎవరూ తమ సందర్శనలలో భారత్, పాకిస్థాన్‌ను జోడించేవారు కాదు. అయితే 2000లోఅమెరికా అధ్యక్షుడు క్లింటన్‌తో ఇది మొదలైంది. గతంలో ఏ అధ్యక్షుడు ఇలా చేయలేదు. ఇది చాలా పెద్ద తిరోగమన చర్య.

## పారిన పాక్ పాచిక

**అంతర్జాతీయ** దృష్టికి కశ్మీర్ సమస్యను తీసుకురావడానికి పాకిస్థాన్ ఎంతోకాలంగా చేస్తున్న ప్రయత్నాలకు ట్రంప్ వ్యాఖ్యలు ఊతమిచ్చాయని కొందరు విమర్శకులు వాదిస్తున్నారు. కశ్మీర్ సమస్యను అంతర్జాతీయం చేయడమే పాకిస్థానీ విదేశాంగ విధానం ప్రధాన లక్ష్యమని, ఇప్పుడు అదే కచ్చితంగా జరిగిందని వాషింగ్టన్‌కు చెందిన దక్షిణాసియా విశ్లేషకుడు మైఖేల్ కుగెల్‌మేన్ అసోసియేటెడ్ ప్రెస్‌తో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. వివాదం పరిష్కారం అయిపోయిందని భావిస్తున్న భారత ప్రభుత్వానికి ఈ పరిణామం ఇబ్బందికరమేనని ఆయన చెప్పారు. తన వ్యూహాత్మక లక్ష్యాన్ని పాకిస్థాన్ సాధించేందుకు ట్రంప్ వ్యాఖ్యలు పరోక్షంగా దోహదపడ్డ మాట వాస్తవమేనని మేజర్ జనరల్ రాయ్ ఒప్పుకున్నారు. 'కశ్మీర్‌ను ప్రపంచ వ్యవహారాలలో కేంద్రస్థానంగా ముఖ్యంగా అమెరికా దృష్టిని ఆకర్షించడంలో పాకిస్థాన్ సఫలీకృతమైంది. ఏప్రిల్ 22 నుంచి పెరుగుతున్న సంక్షోభ కాలంలో పాకిస్థాన్ సాధించిన విజయాలలో ఇది కూడా ఒకటి' అని మేజర్ జనరల్ రాయ్ అభిప్రాయపడ్డారు. అయితే, దేశంలోని ప్రతిపక్ష నాయకులకు ప్రస్తుత సంక్షోభాన్ని ఎదుర్కొనడంలో ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగట్టేందుకు ట్రంప్ వ్యాఖ్యలు బలమైన ఆయుధంగా మారాయి. 'తృతీయ పక్షం మధ్యవర్తిత్వానికి మనం తలుపులు బార్లా తెరిచామా' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రశ్నించారు. కాల్పుల విరమణపై భారత్‌లో కొంత అసంతృప్తి ఉందని, దీనికి కారణం ఎక్కడి నుంచో హఠాత్తుగా ఊడిపడిన ట్రంప్ ఈ ప్రకటన చేయడమేనని బీజేపీకి చెందిన మాజీ ఎంపీ స్వపన్‌దాస్ గుప్తా వ్యాఖ్యానించారు.




# 'అఖండ భారత్' అవకాశాన్ని చేజార్చారు


- సావర్కర్ పేరుతో ఇక రాజకీయాలు చేసే హక్కులేదు
- సామ్నా సంపాదకీయంలో మోదీపై విమర్శల వర్షం

ముంబై, మే 13: పాకిస్థాన్‌పై సైనిక చర్యను నిలిపివేయడానికి అంగీకరించడం ద్వారా 'అఖండ భారత్' కోసం హిందూత్వ సిద్ధాంతకర్త వీడీ సావర్కర్ కన్న కలను నిజం చేసే అవకాశాన్ని నరేంద్ర మోదీ ప్రభుత్వం వృథా చేసిందని శివసేన (యూబీటీ) మంగళవారం వ్యాఖ్యానించింది. యుద్ధం మరో నాలుగు రోజులు కొనసాగి ఉంటే పాక్ ఆక్రమిత కశ్మీరు(పీవోకే), కరాచీ, లాహోర్‌ను భారతీయ సాయుధ దళాలు స్వాధీనం చేసుకుని ఉండేవని, కాని, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ అవకాశాన్ని చెడగొట్టారని శివసేన(యూబీటీ) అధికార పత్రిక సామ్నా తన సంపాదకీయంలో విమర్శించింది. సైనిక చర్యను నిలిపివేసే ముందు భారత్ కనీసం పీవోకేని వాపసు తీసుకుని, బలూచిస్థాన్‌ను పాకిస్థాన్ నుంచి విడగొట్టి ఉండాల్సిందని అభిప్రాయపడింది. పీవోకే నుంచి రామేశ్వరం వరకు, సింధూ నుంచి అస్సాం వరకు విస్తరించిన అవిభక్త భారత్ కోసం సావర్కర్ కలలు కన్నారని, ఆ అఖండ భారత్‌ను సాధించే అవకాశాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, ఆయన ప్రభుత్వం చేజేతులా వదులుకుందని సంపాదకీయం మండిపడింది. ప్రధాని మోదీకి లేదని పత్రిక తెలిపింది.

### ట్రంప్ హెచ్చరికలను ఎలా అంగీకరించగలం?

పాకిస్థాన్‌ను ఉగ్ర దేశంగా ప్రకటిస్తూ తీర్మానాన్ని ఆమోదించేందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాన్ని నిర్వహించాలని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) మంగళవారం డిమాండ్ చేసింది. ఆప్ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాన్ని ఏర్పాటుచేస్తే పాకిస్థాన్‌ను ఉగ్ర దేశంగా ప్రకటిస్తూ తామంతా ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదిస్తామని చెప్పారు. తాను చర్చలకు మధ్యవర్తిత్వం వహించానని, వాణిజ్య ఆంక్షలు విధిస్తామని కూడా హెచ్చరించానని ట్రంప్ ప్రకటించారని సంజయ్ తెలిపారు. దీన్ని తాము ఎలా అంగీకరించగలమని ఆయన ప్రశ్నించారు. ఏప్రిల్ 22న మన పౌరులను చంపిన ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నారని ఆయన మోదీ ప్రభుత్వాన్ని నిలదీశారు.

**• హృదయం లేని మోదీ**



భార్యల కండ్ల ముందే 26 మంది భర్తలను చంపిన నలుగురు పాకిస్థానీ ఉగ్రవాదుల గురించి మోదీ తన ప్రసంగంలో ఎక్కడా ప్రస్తావించలేదు. ఆ ఉగ్రవాదులను పట్టుకొని ఉరితీయడం ఎంతో ముఖ్యం. అయితే, దాన్ని మోదీ విస్మరించారు. దీన్ని బట్టి ఆయనకు బాధితుల పట్ల దయార్ధ్ర హృదయం గానీ, భావోద్వేగాలు గానీ లేవని స్పష్టమవుతున్నది. లేకపోతే, ఆ భావోద్వేగాలు వెంటనే ఆయన నుంచి వచ్చేవి. **- సుబ్రమణ్య స్వామి, బీజేపీ సీనియర్ నాయకుడు**

MINISTRY OF COMMUNICATIONS
DEPARTMENT OF TELECOMMUNICATIONS
O/o Pr. Controller of Communication Accounts, TS Circle,
Sanchar Lekha Bhawan, Chikkadpally, HYDERABAD - 500 020

పత్రికా ప్రకటన

తేది: 06 మే, 2025

# ఈ-పాస్‌పోర్ట్ వచ్చేసింది!

**ఢిల్లీ, మే 13: భారత పాస్‌పోర్ట్ వ్యవస్థను ఆధునీకరణలో భాగంగా విదేశాంగ శాఖ కీలక నిర్ణయం తీసుకున్నది. పాస్‌పోర్ట్ సేవా ప్రోగ్రామ్ (పీఎస్పీ) వెర్షన్ 2.0లో భాగంగా ఈ-పాస్‌పోర్ట్‌ను ప్రవేశపెట్టింది. 2024 ఏప్రిల్ 1న ప్రారంభమైన పీఎస్పీ పైలట్ ప్రాజెక్టులో భాగంగా కేంద్రం తాజా నిర్ణయం తీసుకున్నది. పాస్‌పోర్ట్‌ల భద్రతను మెరుగుపరచడం, ఇంటర్నేషనల్ ప్రయాణాలను స్ట్రీమ్‌లైన్ చేయడం, నకిలీ, ట్యాంపరింగ్ నుంచి పాస్‌పోర్ట్ హోల్డర్ల వ్యక్తిగత డాటాను సంరక్షించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం**

### ఏమిటీ ఈ-పాస్‌పోర్ట్?

ఇది సంప్రదాయ పేపర్ డాక్యుమెంట్ వంటిదే. ఈ-పాస్‌పోర్ట్ కవర్‌పై బంగారు వర్ణపు చిన్న సింబల్ ఉంటుంది. సంప్రదాయ పాస్‌పోర్ట్‌లకు భిన్నంగా ఇందులో ఎలక్ట్రానిక్ చిప్ ఉంటుంది. రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్ఎఫ్ఐడీ) టెక్నాలజీతో ఈ-పాస్‌పోర్ట్ అనుసంధానమై ఉంటుంది. పాస్‌పోర్ట్ కవర్‌లో చిప్, యాంటెన్నా పొందుపరిచి ఉంటాయి. ఈ చిప్‌లోనే పాస్‌పోర్ట్ హోల్డర్ల వ్యక్తిగత, బయోమెట్రిక్ డాటా తదితర కీలకమైన వివరాలు నిక్షిప్తమై ఉంటాయి. తద్వారా అంతర్జాతీయ ప్రయాణాల సమయంలో అథెంటికేషన్ సులభతరం అవుతుంది.

### ఏయే నగరాల్లో అందుబాటులో...

ప్రస్తుతం ఈ-పాస్‌పోర్ట్ సేవలు హైదరాబాద్ సహా 13 నగరాల్లో మాత్రమే అందుతున్నాయి. అయితే, ఈ ఏడాది ప్రథమార్ధం ముగిసే నాటికి దేశంలోని అన్ని పాస్‌పోర్ట్ కేంద్రాల్లో ఈ సేవలను ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తున్నది. **నగరాలు:** హైదరాబాద్, నాగ్‌పూర్, భువనేశ్వర్, జమ్ము, గోవా, సిమ్లా, రాయ్‌పూర్, అమృత్‌సర్, జైపూర్, చెన్నై, సూరత్, రాంచీ, ఢిల్లీ

### అప్‌గ్రేడ్ చేసుకోవాలా?

ఇప్పటికే పాస్‌పోర్ట్ ఉన్నవారు కచ్చితంగా అప్‌గ్రేడ్ చేసుకోవాల్సిన అవసరం లేదు. ప్రస్తుత పాస్‌పోర్ట్‌లు వాటి ఎక్స్‌పైరీ డేట్ వరకు సేవలందిస్తాయి. ఈ-పాస్‌పోర్ట్ అప్‌గ్రేడ్ అనేది ఆప్షనల్ మాత్రమే.




### ఈ-పాస్‌పోర్ట్ వల్ల లాభాలు

- భద్రత మెరుగుపడుతుంది. నకిలీ, ఫోర్జరీ, వ్యక్తిగత సమాచారం చోరీ నుంచి ఇందులో ఉండే డిజిటల్ సంతకంతో కూడిన చిప్ రక్షణ కల్పిస్తుంది.
- అంతర్జాతీయ ప్రయాణాల సామర్థ్యం పెరుగుతుంది. ఇందులో ఉండే చిప్ సాయంతో ఇమ్మిగ్రేషన్ అధికారులు చాలా తక్కువ సమయంలో అథెంటికేషన్ చేయగలుగుతారు. సరిహద్దుల్లో తనిఖీలు వేగవంతమవుతాయి.
- చిప్‌లో స్టోర్ చేసిన సున్నితమైన డాటాను ఇందులోని పబ్లిక్ కీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (పీకేఐ)ఎన్‌క్రిప్ట్ చేస్తుంది. తద్వారా ఆ డాటాను ఎవరూ యాక్సెస్ చేయలేరు. అన్‌ఆథరైజ్డ్ వర్గాలు అందులోని సమాచారాన్ని మార్చలేవు.

# వాజ్‌పేయి బాటలో మోదీ నడుస్తారా?

ముంబై: కార్గిల్ యుద్ధం అనంతరం అప్పటి వాజ్‌పేయి ప్రభుత్వం వెంటనే సమీక్షా కమిటీని ఏర్పాటు చేసిన తరహాలోనే పహల్గాం ఉగ్ర దాడిపై నరేంద్ర మోదీ ప్రభుత్వం అటువంటి ప్రక్రియ ఏదైనా తీసుకుంటుందా అని కాంగ్రె స్ ప్రశ్నించింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశాన్ని, ప్రత్యేక పార్లమెంట్ సమాశాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని తమ పార్టీ పదేపదే డిమాండు చేస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్ల ఇన్‌చార్జి) జైరాం రమేష్ మంగళవారం తెలిపారు. కార్గిల్ యుద్ధం ముగిసిన 3 రోజుల రత్వాత అప్పటి ప్రధాని వాజ్‌పేయి ప్రభుత్వం కార్గిల్ సమీక్షా కమిటీని ఏర్పాటు చేసిందని ఎక్స్ పోస్టులో జైరాం రమేష్ తెలిపారు. ఆ కమిటీకి భారత వ్యూహాత్మక వ్యవహారాల గురువు కే సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారని, ఆయన కుమారుడే ఇప్పటి విదేశీ వ్యవహారల మంత్రి ఎస్ జైశంకర్ అని వివరించారు.

### విదేశాంగ విధానాన్ని ఔట్ సోర్సింగ్ ఇచ్చారా?

జాతినుద్దేశించి ప్రధాని మోదీ చేసిన ప్రసంగాన్ని మరో ఏకపాత్రాభినయంగా కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే అభివర్ణించారు. కాల్పుల విరమణ ప్రకటనను ప్రధాని మోదీ కాకుండా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎందుకు చేశారని ఆయన ప్రశ్నించారు. భారత్ తన విదేశాంగ విధానాన్ని అమెరికాకు ఔట్‌సోర్సింగ్ ఇచ్చిందా అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 'అసలు ఏం జరిగింది?, ఎందుకోసం కాల్పుల విరమణ?, కాల్పుల విరమణకు షరతులు ఏమిటి?, భారత ప్రధాని కాకుండా అమెరికా అధ్యక్షుడు ఎందుకు కాల్పుల విరమణ ప్రకటన చేశారు? వంటి విషయాలన్నిటిపై ప్రభుత్వం నుంచి వివరణ కోరేందుకు ప్రధాని నరేంద్ర మోదీని మేము అఖిల పక్ష సమావేశాన్ని కోరుతున్నాం" అని ప్రియాంక్ చెప్పారు.

## చిత్తశుద్ధితో అమలు చేయండి

- రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్సపై కేంద్రానికి సుప్రీం ఆదేశం



న్యూఢిల్లీ, మే 13: రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స పథకాన్ని చిత్తశుద్ధితో అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ పథకం కింద బాధితులకు గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకు ఉచిత చికిత్సను అందజేస్తారు. ఈ పథకం అమలు తీరు, దీని కింద ఎంతమంది లబ్ధిదారులకు చికిత్స అందించారు తదితర వివరాలతో ఈ ఏడాది ఆగస్టు నెలాఖరులోగా కేంద్రం అఫిడవిట్ దాఖలు చేయాలని జస్టిస్‌లు అభయ్ ఎస్ ఓకా, ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ఈ పథకం నిజమైన స్ఫూర్తితో అమలయ్యేలా కేంద్ర ప్రభుత్వాన్ని తాము నిర్దేశిస్తున్నామని ధర్మాసనం పేర్కొంది. ఈ పథకం మే 5 నుంచి అమలులోకి వచ్చిందని, గెజిట్ నోటిఫికేషన్ కూడా జారీ చేసినట్టు కేంద్రం వివరించింది. నగదు రహిత పథకం జాప్యంపై ఏప్రిల్ 28న కేంద్రాన్ని సుప్రీం మందలించింది.

## కొన్ని వారాల్లోనే బీపీని తగ్గించే ఔషధం

- అభివృద్ధి చేసిన యూఎస్ శాస్త్రవేత్తలు



న్యూఢిల్లీ: రక్తపోటును(బీపీని) కొన్ని వారాల్లోనే 15 పాయింట్లు తగ్గించే కొత్త మందును శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. కాలిఫోర్నియా యూనివర్సిటీ పరిశోధకులు ఈ ఔషధానికి లోరన్‌డ్రోస్టాట్ అని పేరు పెట్టారు. ఈ ఔషధం నియంత్రణ లేని లేదా చికిత్స తీసుకుంటున్న అధిక రక్తపోటును తగ్గిస్తుందని వారు తెలిపారు. అమెరికా వ్యాప్తంగా రోగులతో కలిపి 285 మందిపై ఈ ఔషధంతో క్లినికల్ ట్రయల్స్ నిర్వహించారు. ఇందులో ప్లాసిబో తీసుకున్న వారిలో తగ్గిన 7 బీపీ పాయింట్లతో పోలిస్తే లోరన్‌డ్రోస్టాట్ తీసుకున్న వారిలో సిస్టోలిక్ రక్తపోటు 15 పాయింట్లు తగ్గింది. ఆమోదించదగిన సైడ్ ఎఫెక్టులతో లోరన్‌డ్రోస్టాట్ సమర్థంగా పనిచేస్తున్నదని అధ్యయన ముఖ్య రచయిత, కార్డియాలజిస్ట్ క్లీవ్‌లాండ్ పేర్కొన్నారు. ఇతర మందులను వాడినప్పుడు వచ్చే దుష్ప్రభావాలతో పోలిస్తే లోరన్‌డ్రో స్థిరంగా పని చేస్తున్నదని తెలిపారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు

IHMH Institute of Hotel Management Hyderabad
पर्यटन मंत्रालय MINISTRY OF TOURISM
सत्यमेव जयते
NCHMCT

**Institute of Hotel Management Catering Technology & Applied Nutrition**
F - Row, D.D. Colony, Vidyanagar, Hyderabad - 500 007 (Telangana).
Tel: 040-27427569, Mob: 8374787988, Email id: ihmhyd.principal@gmail.com and website www.ihmhyd.org.

**On behalf of National Council for Hotel Management and Catering Technology, Noida, IHM**
Hyderabad calls for application, from the eligible candidates to get admission in to 1st year of 3-Years B.Sc.-HHA (Hospitality & Hotel Administration) program with the following eligibility criteria against the residual vacancies at IHM-Hyderabad which is affiliated to NCHMCT:

1. Candidate must have passed 12th Examination from a recognized board, in any stream (Science/Arts/Commerce/ Vocational).
2. English should be one of the subjects in 12th level and student should have passed in the subject (English).
3. There is No Age bar
4. The program recognized by **Jawaharlal Nehru University** which awards the final degree.
5. Reservation as per government rules

Interested candidate must apply to the Institute by attaching self-attested copies of testimonials **at the earliest** in person. Applications may also be sent by post or vide email at ihmhyd.principal@gmail.com. The admission form and other details are available on the website www.ihmhyd.org

Admission help Line Numbers: **+91-8374787988**
Name of contact person **Mrs. Aruna / Mr. Prem Sagar** Mobile number of contact person **+91-9059440793**

Admission will be offered on the basis of a written test to be conducted by NCHMCT for residual vacancies for which the dates will be intimated to the eligible applicants. Candidates may follow institute website for information on the written test schedule.

**Principal/Secretary**